సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం | 3 | మార్చి | 2023



చేతివాటంలో..

విద్యుత్ శాఖలో కొందరు చేతివాటం చూపుతున్నారు. విజిలెన్స్, ఏసీబీ దాడులు జరుగుతున్నాయి. - 8లో



సంస్కరణలు తప్పనిసరి

జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కాలేజీలో నేషనల్ సెమినార్ ప్రారంభమైంది. సావనీర్ ఆవిష్కరించారు. - 8లో

శ్రీముఖలింగం ఆలయ హుండీ లెక్కింపు వాయిదా

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా పడినట్లు ఈఓ పి.ప్రభాకరరావు గురువారం తెలిపారు. వాస్తవంగా హుండీ లెక్కింపు గురువారం జరగాల్సి ఉండగా సాంకేతిక కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మళ్లీ ఎప్పుడు లెక్కించనున్నారో తేదీ తెలియజేస్తామని ఈఓ తెలిపారు.

న్యూస్‌రీల్

తాగునీరు రావడం లేదా..?



టి.శ్రీనివాసప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

అరసవల్లి: జిల్లాలో ప్రజలకు నీటి వనరులు నిరంతరం అందుబాటులో ఉండేలా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చర్యలు చేపట్టిందని, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రభావిత ప్రాంతాల్లో సైతం మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.శ్రీనివాస ప్రసాద్ తెలియజేశారు. ఇంకా ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు గానీ, అంతరాయం గానీ, లేక తాగునీరు అందని పరిస్థితులుంటే 9100120604 నంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల లోపు కాల్ చేసి వివరాలను తెలియజేయాలని ఆయన కోరారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

హరిపురం డయాలసిస్ సెంటర్‌కు మరో రెండు బెడ్లు



హరిపురం సీహెచ్‌సీలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ బెడ్లు

మందస: మండలంలోని హరిపురం డయాలసిస్ సెంటర్‌లో మరో రెండు బెడ్లు అదనంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ పది బెడ్లు ఉన్నాయి. అయితే ఇవి సరిపోవడం లేదని మంత్రి సీదిరి అప్పలరాజు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో మరో రెండు బెడ్లను మంజూరు చేశారు. కొత్తగా మంజూరైన మిషనరీ, బెడ్లను ఇన్‌స్టాల్ చేసినట్టు అపోలో డయాలసిస్ క్లినిక్ కేంద్రం మేనేజర్ దువ్వూరి స్వరూప్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక బాధితులకు దగ్గరగా డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగానే హరిపురంలోనూ సెంటర్ ఏర్పాటు చేశారు.

త్వరలో కోటబొమ్మాళిలో మహిళా మార్ట్



కోటబొమ్మాళిలో భవనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

కోటబొమ్మాళి: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కోటబొమ్మాళి ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో కొత్తగా మహిళా మార్టును ఈనెల 16వ తేదీ తర్వాత ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ తెలిపారు. ఆయన గురువారం కోటబొమ్మాళిలో ఏర్పాటు చేయనున్న మహిళా మార్టు భవనాన్ని పరిశీలించారు. జిల్లాలో ఇప్పటికే శ్రీకాకుళం, నరసన్నపేటలో మార్టులు ప్రారంభించామని, డ్వాక్రా మహిళలు చక్కగా నడుపుతున్నారని తెలిపారు. కోటబొమ్మాళిలో డీఆర్‌డీఏ భవనం అనుకూలంగా ఉందన్నారు. అనంతరం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమీక్ష నిర్వహించారు. హరిశ్చంద్రపురం సచివాలయ పరిధిలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, ఎసీ ఎస్.శ్రీరాములు, ఏపీఎం కె.రాము, సీసీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురు వృద్ధులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న బాధితులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి గ్రామంలో పిచ్చికుక్క హడలెత్తించింది. ఊరిలో స్వైర విహారం చేస్తూ పోలాకి లచ్చమ్మ, దాసరి శివరాం, కొర్నాన పుణ్యావతి అనే ముగ్గురు వృద్ధులపై దాడి చేసిందని స్థానికులు తెలిపారు. అలాగే అల్లాడ కొండరావు, కోనారి బారికిరావులకు చెందిన మూగ జీవాలపై సైతం దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో క్షతగాత్రులను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిని వైఎస్సార్ సీపీ నాయకులు మనుమంతు రామ్మోహన దొర, డబ్బీరు భవానీ పరామర్శించారు.

పరిశ్రమలు ప్రాప్తిరస్తు

- పారిశ్రామికవేత్తలకు సిక్కోలు స్వర్గసీమ
- అందుబాటులో వేలాది ఎకరాల భూములు
- పుష్కలంగా మంచినీరు, రవాణా వనరులు
- గ్లోబల్ సమ్మిట్‌పై ఆశలు
- పెట్టుబడులు వస్తాయని ఎదురుచూపు
- ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించిన యంత్రాంగం





పైడిభీమవరంలో ఫార్మా పరిశ్రమలు

సువిశాలమైన సాగరతీరం.. దాని వెంబడి ఏర్పాటవుతున్న పోర్టులు.. బీచ్ శాండ్ మినరల్స్, గ్రానైట్, ఇతర విలువైన ఖనిజ వనరులు.. రైల్, రోడ్డు, సీ కనెక్టివిటీ.. త్వరలో ఏర్పాటుకానున్న భోగాపురం విమానాశ్రయం.. అపారమైన మత్స్య సంపద.. పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలు.. అన్నింటికీ మించి భూ సంపద, మానవ శక్తి... వెరసి ఎన్నో రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్న జిల్లా సిక్కోలు. ఇప్పటికే ఎన్నో భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఉన్న జిల్లాలో పారిశ్రామికవేత్తలకు అక్షయపాత్రలాంటిది అనడంలో సందేహం లేదు. ప్రభుత్వ ప్రోత్సాహంతో వీటిని సద్వినియోగించుకుంటే జిల్లా పారిశ్రామిక స్వర్గంగా మారుతుందనడంలో సందేహం లేదు. సరిగ్గా ఇటువంటి ఆలోచనే చేస్తోంది జిల్లా అధికార యంత్రాంగం. విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నేపథ్యంలో జిల్లా వనరులు, అవకాశాలను వివరిస్తూ ఒక డాక్యుమెంటరీని రూపొందించింది. దాన్ని సమ్మిట్‌లో పాల్గొనేవారికి చూపించి పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్... విశాఖలో నేటి నుంచి నిర్వహిస్తున్న అరుదైన కార్యక్రమం. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న ఈ సమ్మిట్‌పైనే జిల్లా కూడా కోటి ఆశలు పెట్టుకుంది. దేశ, విదేశాల్లోని పారిశ్రామిక దిగ్గజాలు వస్తుండడంతో వారి చూపు శ్రీకాకుళం వైపు పడుతుందని ఆశ పడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే ఫార్మా, జీడి పరిశ్రమలు ఉన్నాయి. మరిన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు అన్ని అర్హతలు శ్రీకాకుళానికి ఉన్నాయి.

పారిశ్రామిక మణిహారం..



జిల్లా పారిశ్రామిక మణిహారంగా పైడి భీమవరం ఉంది. సిక్కోలు పారిశ్రామిక ప్రగతి చూడాలంటే జిల్లాకు స్వాగతం పలుకుతున్న పైడిభీమవరంలోని పరిశ్రమలు చూస్తే చాలు. ఇక్కడ రెడ్డీస్, అరబిందో,ఆంధ్రా ఆర్గానిక్స్ వంటి సంస్థలు ఉన్నాయి. వీటి విస్తరణకు ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఇక్కడ వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. మన జిల్లానే కాదు కాదు పొరుగునున్న విజయనగరం, విశాఖపట్నంకు చెందిన వారు కూడా వీటిలో పనిచేస్తున్నారు. ఇక్కడ దాదాపు 400 ఎకరాలతో ఫార్మా క్లస్టర్ నడుస్తోంది.

మరో 1200 ఎకరాల్లో..



కొత్త పరిశ్రమల రాక కోసం ఇక్కడ 1200 ఎకరాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. సంచాం, చిట్టివలస, నరవ గ్రామాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఏపీఐఐసీ ద్వారా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇక్కడున్న పరిశ్రమల కోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించింది. క్వాలిటీ మంచినీటిని అందించేందుకు డీ శానిటేషన్ ప్లాంట్‌ను అభివృద్ధి కూడా చేసింది. నాణ్యమైన విద్యుత్‌ను కూడా అందిస్తోంది.

తెల్ల బంగారం పరిశ్రమల కోసం..



తెల్లబంగారంగా చెప్పుకునే జీడి పిక్కల పరిశ్రమలకు పలాస-కాశీబుగ్గ కేరాఫ్ అడ్రస్. ఇక్కడ 31 ఎకరాల్లో జీడి పప్పు క్లస్టర్ ఉంది. ఇప్పటికే ఇక్కడ 200 పరిశ్రమలు ఉన్నాయి. దేశ, విదేశాలకు ఇక్కడ జీడిపప్పు ఎగుమతి అవుతోంది. ఇక్కడున్న డిమాండ్, అవకాశాల దృష్ట్యా కాశీబుగ్గకు సమీపంలోని రామకృష్ణాపురంలో 66 ఎకరాలను సేకరించి ఏపీఐఐసీ ద్వారా పారిశ్రామిక వాడ అభివృద్ధికి అడుగులు వేస్తోంది. ఇది ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా చెబుతారు.

సంతబొమ్మాళిలో 1500 ఎకరాలు సిద్ధం..



టెక్కలి, కోటబొమ్మాళి, మెళియాపుట్టిలో గ్రానైట్ పరిశ్రమ విస్తరించి ఉంది. దాదాపు 150 పరిశ్రమలు నడుస్తున్నాయి. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. విలువైన గ్రానైట్ తవ్వకాలు జరిగి, దేశ, విదేశాలకు ఎగుమతి అవుతోంది. సంతబొమ్మాళిలో పరిశ్రమల కోసం సుమారు 1500 ఎకరాలను ప్రభుత్వం సిద్ధం చేసింది.

జిల్లాలో ప్రస్తుతం ఉన్న భారీ పరిశ్రమలు	: 20
వీటి పెట్టుబడి	: రూ. 11,469 కోట్లు
కొత్తగా నిర్మాణంలో ఉన్న భారీ, మధ్య తరహా పరిశ్రమలు	: 7
కొత్తగా నిర్మిస్తున్న వాటి పెట్టుబడి	: రూ. 6,040 కోట్లు
అదనంగా ఉపాధి పొందే వారి సంఖ్య	: 13,600
జిల్లాలో ప్రస్తుతం ఉన్న చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు	: 5813
వీటి పెట్టుబడి	: రూ. 628.35 కోట్లు
ఉపాధి పొందుతున్న వారి సంఖ్య	: 43,453

జిల్లాలో ఉన్న పారిశ్రామిక వాడలు : పైడి భీమవరం, శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, బలగ

వనరులు అపారం

ఏ ప్రాంతమైనా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే నీటి నిల్వలు అవసరం. మన జిల్లాలో పుష్కలంగా ఉన్నాయి. దానికి వంశధార, నాగావళి, మహేంద్ర తనయ, బాహుద వంటి నదులే కారణం.

- పరిశ్రమలకు అవసరమైన నీరు అందించగల సామర్థ్యం జిల్లాలోని నదులకు ఉంది.
- మరోవైపు 193 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. మత్స్య సంపదకు అనువైన ప్రాంతమిది.
- ఆక్వా ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన ప్రదేశంగా తీసుకోవచ్చు. దానికి తగ్గట్టుగానే ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించింది.
- గ్రానైట్, జీడి ఎగుమతులతో పాటు మత్స్య సంపద ఎగుమతులకు ఉపయోగపడేలా భావనపాడులో ప్రత్యేకంగా పోర్టును నిర్మిస్తోంది. త్వరలోనే పోర్టు పనులకు శంకుస్థాపన చేయనుంది.
- జిల్లాలో 172 కిలోమీటర్ల పొడవున 16వ నంబర్ గల జాతీయ రహదారి ఉంది. ఆరు లైన్ల విస్తరణ పూర్తయ్యింది. ఇటు కోల్‌కతా, అటు చెన్నై, తెలంగాణకు అందమైన రోడ్లు ఉన్నాయి. అలాగే రైల్వే మార్గం ఉంది.
- జిల్లా ముఖద్వారమైన పైడి భీమవరానికి 30 కిలోమీటర్ల దూరంలోని భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో నిర్మించనున్నారు.
- జిల్లాలో 3,330ఎకరాల అన్ డెవలప్డ్ ల్యాండ్ ఉంది. అలాగే, జిల్లా వ్యాప్తంగా పారిశ్రామిక అవసరాల కోసమని 5400 ఎకరాలు సేకరించి యంత్రాంగం సిద్ధంగా ఉంచింది. ఇవన్నీ పరిశ్రమల స్థాపనకు దోహదపడే సానుకూల అంశాలు. వీటిన్నింటి పైనా జిల్లా యంత్రాంగం ఒక డాక్యుమెంటరీ కూడా రూపొందించింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేలా ఆ వీడియో ఉంది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు 4 పోలింగ్ కేంద్రాలు



ఆర్.వెంకటరామన్, జెడ్పీ సీఈఓ

అరసవల్లి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 38 మండలాలకు చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచామని జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.వెంకటరామన్ తెలియజేశారు. ఈ నెల 13న జరగనున్న ఈ శాసనమండలి ఎన్నికలకు 'స్థానిక' పాలకులంతా ఓటర్లుగా ఉంటారని, వీరి కోసం నాలుగు డివిజనల్ కేంద్రాల్లో నా లుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. వీరంతా ఈనెల 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోపు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని చెప్పారు.

- ఆమదాలవలస, బూర్జ, ఎచ్చెర్ల, జి.సిగడాం, గార, జలుమూరు, లావేరు, నరసన్నపేట, పోలాకి, పొందూరు, రణస్థలం, సరుబుజ్జిలి, శ్రీకాకుళం మండలాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు-**రెవెన్యూ డివిజనల్ కార్యాలయం (ఆర్డీవో), శ్రీకాకుళం.**
- భామిని, పాలకొండ, ఆర్.ఆమదాలవలస, రాజాం, సంతకవిటి, సీతంపేట, వంగర, వీరఘట్టం మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు - **మీటింగ్ హాల్, సబ్ కలెక్టర్ ఆఫీస్, పాలకొండ.**
- హిరమండలం, కోటబొమ్మాళి, కొత్తూరు, ఎల్ఎన్.పేట, మెళియాపుట్టి, పాతపట్నం, సంతబొమ్మాళి, సారవకోట, టెక్కలి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు - **సబ్ కలెక్టర్ ఆఫీస్, టెక్కలి.**
- ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు - **మీటింగ్ హాల్, తహసీల్దార్ కార్యాలయం, పలాస.**

గ్యాస్ సిలెండర్ ధర పెంపుపై నిరసన



ఖాళీ గ్యాస్ బండతో నిరసన తెలియ జేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు.

ఎచ్చెర్ల క్యాంపస్: గ్యాస్ సిలెండర్ ధర పెంపుపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో గురువారం నిరసన తెలియజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ ఒక్కసారి వాణిజ్య సిలెండర్‌పై రూ. 350, గృహ వినియోగ సిలెండర్‌పై రూ. 50 పెంచడం వల్ల సామాన్యులు, చిరువ్యాపారులపై భారం పడుతుందన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు పాటిస్తోందని విమర్శించారు. 2014లో రూ.417 ఉన్న గృహ వినియోగ గ్యాస్ సిలెండర్ ప్రస్తుతం రూ.1155కు చేరుకుందన్నారు. పేదలపై పన్నులు విధించి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు.

93.46 శాతం పింఛన్లు పంపిణీ



సింగుపురం-1 సచివాలయం పరిధిలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో భాగంగా గురువారం నాటికి జిల్లాలో 93.46 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఏఓ బీవీవీఎస్ దొర పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు బొడ్డపాడు విద్యార్థి

పలాస: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మురిపింటి రోహిత్ ఎంపికయ్యాడు. పలాస మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన రోహిత్ ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీకాకుళం జట్టు తరఫున ఆడాడు. ఈ విద్యార్థి ఆంధ్రా కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో అతనికి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. అలాగే అండర్ -14 విభాగం క్రికెట్‌లో మచిలీపట్నంలో జరిగిన పోటీల్లో రాపాక సాహిత్ పాల్గొని చక్కటి ప్రతిభను కనపరిచాడు. వీరిద్దరినీ పాఠశాలలో ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.వీర్రాజు, పి.డి రామ్‌జీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చరిత భద్రం..




కెమెరాతో దృశ్యాన్ని బంధిస్తున్న శ్రీనివాస్

- సిక్కోలు చరితను నిక్షిప్తం చేస్తున్న ఇంటాక్ ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్
- వందలాది చారిత్రక స్థలాల ఫొటోలతో ప్రదర్శనలు
- ఇంటాక్‌లో శాశ్వత సభ్యత్వం

శ్రీకాకుళం కల్చరల్:

అరసవల్లి ఆలయం అందరికీ తెలుసు. కానీ అక్కడి శిలా శాసనాలు ఎప్పుడైనా గమనించారా..? బారువ వద్ద ఓ షిప్ మునిగిపోయిందని జిల్లా అంతటికీ తెలుసు. కానీ భావనపాడు, పోలాకి వద్ద కూడా మరో రెండు షిప్పులు ఇసుక దిబ్బల మధ్య సమాధై పోయాయని తెలుసా..? శ్రీకూర్మంలో ఆకుపసర చిత్రాలు చూసే ఉంటారు. టెక్కలి రాజస్థానంలో మ్యూరల్ పెయింటింగ్స్ ఎన్నడైనా చూశారా..? ఎస్ఎం పురం అంటే షేర్ మహ్మద్ పురం అని వినే ఉంటారు. ఆ పురంలోని ప్యాలెస్‌లో అతిపెద్ద దిగుడు బావి గురించి విన్నారా..? ఇలా తెలిసిన సిక్కోలు చరిత్ర మాటున తెలియని విషయాలు చాలా ఉండిపోయాయి. ఆ రహస్యాలను, ఆయా ప్రాంతాలు దాచుకున్న జ్ఞాపకాలను ఫొటో తీసి భవిత కోసం భద్రపరుస్తున్నారు మండా శ్రీనివాసరావు. ఇంటాక్ ఫొటోగ్రాఫర్‌గా ఆయన నిక్షిప్తం చేస్తున్న చిత్రాలు సజీవ సిక్కోలు చరిత్రకు తార్కాణాలు. ఓ వైపు ఇండియన్ బ్యాంక్‌లో పనిచేస్తూ మరోవైపు కెమెరా భుజాన వేసుకుని గత కాలపు గురుతులను క్లిక్‌మనిపించే శ్రీనివాసరావు ఎన్నో ఫొటో ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. అందుకు ప్రతిఫలంగా ఇంటాక్(భారత జాతీయ సంస్కృతి కళ వారసత్వ సంపద పరిరక్షణ సంస్థ)లో శాశ్వత సభ్యునిగా గుర్తింపు పొందారు. శ్రీకాకుళంలోనే నివాసం ఉండే శ్రీనివాసరావు ఎమ్మెస్సీ చదివారు. మృందంగంలో డిప్లమో కూడా తీసుకున్నారు. 1992 నుంచి ఇండియన్ బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఫొటోగ్రఫీ అంటే ఇష్టమున్న శ్రీనివాసరావును 2005లో ఇంటాక్ కన్వీనర్ దూసి ధర్మారావు గమనించారు. అప్పటి నుంచి ఆ కెమెరా కళ్లతో జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను ఫొటోలు తీయించి నిక్షిప్తం చేయించారు. ఈ చిత్రాలతో ఇంటాక్ తరఫున 100కుపైగా ఫొటో ప్రదర్శనలు నిర్వహించారు. 2006లో మొదటిసారిగా ఇంటాక్ తరఫున ఒక బ్రోచర్‌ను 'గ్లాన్స్ ఎట్ ఏ గ్లోరియస్ శ్రీకాకుళం' పేరుతో రూపొందించారు.



శ్రీకాకుళం.. ఏ స్టోరీ ఆన్ స్టోన్ పుస్తకం

ఎన్నెన్నో అందాలు..

తేలుకుంచి, తేలినీలాపురం, గుళ్లసీతారాంపురం, మెట్టుగూడ పాల్స్(సీతంపేట), షేర్‌మహ్మద్ ఖాన్ ప్యాలెస్‌లో అతిపెద్ద దిగుడుబావి, అరసవల్లిలోని శిలాశాసనాలు వంటివి ఈ అరుదైన చిత్రాల్లో ఉన్నాయి. టెక్కలిలో అప్పటి రాజస్థానంలోని మ్యూరల్ పెయింటింగ్స్, అలాగే టెక్కలి సమీపంలో 5 గుహలు, పోలాకి మండలం జోగంపేట వద్ద మునిగిపోయిన షిప్పు, అక్కడ ఇప్పటికీ జరుగుతున్న పూజలు, బారువ వద్ద మునిగిపోయి షిప్, బారువా వద్ద కృష్ణదేవరాయలు జనార్దనస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన గంట, భావనపాడు హార్బర్ వద్ద మునిగిపోయిన షిప్ వంటివన్నీ ఈయన రికార్డు చేసిన చిత్రాల్లో ఉన్నాయి. ఈ చారిత్రక స్థలాలతో 'శ్రీకాకుళం ఏ స్టోరీ ఆన్ స్టోన్' పేరుతో పుస్తకాన్ని కూడా రూపొందించారు. ఈ వివరాల సేకరణ తనకెంతో తృప్తినిస్తుందని ఆయన చెబుతారు. మద్రాస్ తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్య భారత గౌరవ సత్కారం, మాల్పల్లి పూజా కమిటీ కోల్‌కత్తా వారి నవరత్న అవార్డు వంటివి అందుకున్నారు.

రేపు ఉచిత రక్త పరీక్షలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానం ప్రాంతంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. శనివారం వజ్రపుకొత్తూరు మండలంలోని గోవిందపురం, అక్కుపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి కిడ్నీ వ్యాధి నిర్ధారణ కోసం రక్త పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇదివరకే ఫిబ్రవరి 25న 648 మందిని పరీక్షించామని, అంతకు ముందు కూడా వెయ్యిమందిని పరీక్షించామని తెలిపారు. గోవిందపురం, అక్కుపల్లి గ్రామాలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రాథమికంగా కిడ్నీవ్యాధిని గుర్తించడం మంచిదన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు కూడా సరఫరా చేస్తారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ యూనివర్సిటీ



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. విద్యార్థులు తమ దృష్టికి వచ్చిన సమస్యలు ఫోన్‌లో తెలపాలని చెప్పారు. శనివారం ఉదయం 10 గంటలు నుంచి 11 గంటల మధ్య ఫోన్ ఇన్ లైవ్ ఉంటుందని, విద్యార్థులు ఫోన్ నంబర్ 8247861919కు కాల్ చేసి తమ సమస్యలు చెప్పుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

అమృత్ సరోవర్ పూర్తి చేయాలి



అమృత్ సరోవర్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

గార: మార్చి నెలాఖరు నాటికి అమృత్ సరోవర్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం వత్సవలస పంచాయతీ ఆమదాలపాడు పాత చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. వేతనదారుకు రోజుకు గరిష్టంగా రూ.250 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేతనాల ఆధారంగానే నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, ఏపీఓ సీహెచ్ సంధ్యారాణి, తెలుకోటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ బ్లాకులు పట్టివేత



టెక్కలి మైన్స్ అధికారులు పట్టుకున్న గ్రానైట్ బ్లాకులు

టెక్కలి: మండలంలోని మేలిసతివాడ నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ బ్లాకులను గురువారం టెక్కలి మైన్స్ అధికారులు పట్టుకున్నారు. మైన్స్ ఏజీ కుమారస్వామి, సిబ్బంది మాటువేసి వీటిని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ సరైన సమాధానం చెప్పకపోవడంతో వాహనంతో పాటు బ్లాకులను టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, మేలిసతివాడ సమీపంలోని సాయి అమృత గ్రానైట్ క్వారీ నుంచి ఈ బ్లాకులను తరలిస్తున్నట్లు సమాచారం.

వైభవంగా చక్రధరుని గరుడ వాహనసేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న చక్రధర పెరుమాళ్‌స్వామి

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగలో చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవాలలో భాగంగా గురువారం గరుడవాహన సేవ కమనీయంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామవీధుల్లో శ్రీదేవీ భూదేవీ సమేత చక్రధర స్వామికి శాస్త్రోక్తంగా గరుడవాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల కృష్ణారావు, శ్రీరాంబాబు, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేతివాటంలో.. ‘పవర్’ చూపిస్తున్నారు!

- వివాదాల్లో విద్యుత్ శాఖ
- వరుసగా వెలుగుచూస్తున్న అక్రమాలు
- ఓ వైపు విజిలెన్స్.. మరోవైపు ఏసీబీ దాడులు

అరసవల్లి :

విద్యుత్ వినియోగదారుని సంతృప్తిశాతం పెంచేలా ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థల లోటును తీర్చుతూ ఆర్థికంగా బలపరుస్తుంటే.. క్షేత్రస్థాయిలో కొందరు ఉద్యోగులు చేతివాటాలను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ శాఖ పనుల్లో అక్రమాలకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామ వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు పేరిట వందలాది మంది జూనియర్ లైన్‌మేన్లను జిల్లాలో నియమించారు. అయినప్పటికీ ఇంకా విద్యుత్ అవసరాల నెపంతో కొందరు ఉద్యోగులు లంచాలిస్తేనే పని అవుతుందనేలా ప్రవర్తిస్తున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 38 మండలాల్లో అధికశాతం మండలాల్లో లంచావతార పరిస్థితులు ఎక్కువవుతున్న తరుణంలో వీటిని ఎలాగైనా చెక్ పెట్టేలా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కట్టడి చేస్తున్నా..

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, తొలగింపు, కొత్త లైనింగ్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, అదనపు విద్యుత్ సామర్థ్యం పెంపు ఇతరత్రా పనులకు ఎప్పటికప్పుడు డిమాండ్ ఉంటుంది. వీటితో పాటు వ్యవసాయ విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ రైతులు తమ పంట పొలాల్లో పంపుసెట్లు ఏర్పాటు చేసేందుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 30 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తోంది. ఇంకా 397 వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కనెక్షన్లకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు ఎస్టిమేషన్ల కోసం కొందరు ఏఈలు రైతుల నుంచి వేలాది రూపాయలను లంచంగా డిమాండ్లు చేస్తున్నారు. రణస్థలం, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, పాతపట్నం, పాలకొండ, టెక్కలి, కోటబొమ్మాళి, సారవకోట, పొందూరు, రాజాం, సరుబుజ్జిలి, ఆమదాలవలస తదితర మండలాల్లో ఇలాంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో అటు విజిలెన్స్, ఇటు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రంగంలోకి దిగారు.



విద్యుత్ సర్కిల్ కార్యాలయం

ఇప్పటికే పలు చోట్ల దాడులు నిర్వహించారు. కొందరు దొరికి ఊచలు లెక్కపెడుతుండగా.. మరికొందరిపై బదిలీ, సస్పెన్షన్ వేటు పడ్డాయి.

అక్రమాల తీరు ఇలా..

గత కొద్ది నెలల క్రితం శ్రీకాకుళం డి-3 విభాగ ఏఈగా పనిచేసిన ఏఈ పైడి దుర్గాప్రసాద్, శ్రీకాకుళం రూరల్ ఏఈగా పనిచేసిన నాగేశ్వరరావులు విధుల్లో పలు అక్రమాలకు పాల్పడినట్లుగా రుజువు కావడంతో వీరిద్దరినీ సస్పెండ్ చేశారు. ప్రస్తుతం సీతంపేట ఏడీఈగా పనిచేస్తున్న తిరుమలరెడ్డిపై కూడా పోలీస్ ఫిర్యాదులు, కోర్టు కేసులు, అక్రమాల ఆరోపణలున్నట్లుగా విజిలెన్స్ అధికారులు ధ్రువీకరిస్తున్నారు. ఈయనపై గతంలో సస్పెండ్ వేటు కూడా పడింది. సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసిన కారణంగా సబ్ ఇంజినీర్ షేక్ బషీర్‌ను కూడా ఎస్‌ఈ దైవప్రసాద్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. రణస్థలంలో సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న డి.రమణమూర్తి, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విషయంలో అక్రమాలకు పాల్పడినట్లుగా గుర్తించడంతో ఆయన్ను మెళియాపుట్టి మండలానికి బదిలీ చేశారు. తాజాగా శ్రీకాకుళం రూరల్ ఏఈ జి.వి.రమణ..కిల్లిపాలెం రైతుల నుంచి రూ.30 వేలు డిమాండ్ చేసి ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబట్టాడు. ఈయన్ను కూడా సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక విజిలెన్స్ విభాగం కూడా స్థానికంగా పనిచేస్తున్న పలువురు విద్యుత్ ఉద్యోగుల విధుల నిర్లక్ష్యం, కండక్ట్ రూల్స్ అతిక్రమణ పేరిట విద్యుత్ విజిలెన్స్ అధికారులు మెమోలు జారీ చేశారు. 1104 యూనియన్ నేత ఎం.వి.గోపాలరావు పలు అక్రమాలకు పాల్పడ్డాడని, అనుమతి లేకుండా సినిమాల్లో నటించాడని, మెడికల్ లీవ్‌లో ఉంటూ ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడంపై గోపాలరావు (గోపి)పై షోకాజ్ నోటిసులు జారీ చేశారు. జి.సంతోషిమాత అనే మహిళా ఉద్యోగి ..తోటి ఉద్యోగులతో వాగ్వాదాలకు దిగడం, తప్పుడు ఫిర్యాదులు చేయడంపైనా విజిలెన్స్ అధికారుల నివేదికల ఆధారంగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇలాగే పలువురు ఉద్యోగుల తీరుపై స్థాన చలనాన్ని కలిగిస్తూ విద్యుత్ ఉన్నత ఉద్యోగులు చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా విద్యుత్ ఉద్యోగులు విధుల పట్ల అంకితభావంగా పనిచేస్తే డిస్కం మరింత ప్రగతిపథంలో నడిచే అవకాశముందని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎవరికీ లంచం ఇవ్వొద్దు..



విద్యుత్ వినియోగదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వవద్దు. ఇప్పటికే పలువురు అధికారుల అక్రమాలు రుజువు కావడంతో చర్యలు చేపట్టాం. మరికొందరికి విధుల నిర్లక్ష్యంపై షోకాజ్ నోటీసులిచ్చాం. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో క్షేత్ర స్థాయిలో అధికారులు పక్కాగా పనిచేయాలి. ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుంది. సంస్థ ఉద్యోగులకు అన్ని విధాలా సహకరిస్తున్నా చేతివాటాన్ని ప్రదర్శించడం దురదృష్టకరం.

– ఎల్.దైవప్రసాద్, ఎస్ఈ

ఫెర్రో కార్మికులకు పూర్తిస్థాయి వేతనాలు



పరిశ్రమ యాజమాన్యంతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్, అధికారులు

టెక్కలి: మండలంలోని రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలో కార్మికులకు మౌలిక సదుపాయాలు, పూర్తి స్థాయిలో వేతనాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని కాలుష్య నియంత్రణ, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖాధికారులు చెప్పారు. ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలో రోజు వారీ వేతనాల్లో కోత విధిస్తున్నారని, పరిశ్రమలో కనీస వసతులు కల్పించడం లేదని, పదవీ విరమణ చేసిన వారికి సదుపాయాలు కల్పించడం లేదని, కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఇటీవల కార్మికులంతా టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం సబ్ కలెక్టర్ సమక్షంలో కాలుష్య నియంత్రణ అధికారులు, కార్మిక శాఖాధికారులు, పరిశ్రమ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. కార్మికులకు పూర్తి స్థాయిలో వేతనాలు అందించాలని, పరిశ్రమలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ యాజమాన్యానికి ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.డి.వి.ప్రసాదరావు, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ శంకర్‌నాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.ఎస్.నారాయణ, పరిశ్రమ ప్రతినిధులు సింహాచలం, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ‘యాస్పైర్ 2కే23’



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

టెక్కలి : టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 9, 10 తేదీల్లో యాస్పైర్ 2కే23 జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఏటా కళాశాలలో పెద్ద ఎత్తున సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఏపీ, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 704 మంది విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులతో హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రాజెక్టులకు 5 లక్షల రూపాయల వరకు ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు. భాగ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉత్తమ విద్యార్థులకు పారితోషికాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సదస్సు కన్వీనర్ యు.డి.ప్రసన్న, కో-కన్వీనర్లు పి.శ్రీహరి, బి.రమేష్‌నాయుడు, కె.వి.లలితాభవాని, జె.నరేష్ కుమార్, టి.మాధురి, కె.హర్ష తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద అగ్నిప్రమాదం

- సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆమదాలవలస రూరల్: మండలంలోని అక్కివరం పంచాయతీ కొత్తరోడ్డు జంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న బీఎస్ఎన్ఎల్ మైక్రోవేవ్ ఎక్స్ఛేంజ్ సెల్‌టవర్ వద్ద గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. దట్టమైన పొగలు వ్యాపించడంతో పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సెల్‌టవర్ ఖాళీ ప్రదేశంలో పిచ్చి మొక్కలు, రెల్లి పొదలు ఏపుగా పెరిగి పూర్తిగా ఎండిపోయి ఉన్నాయి. అటువైపుగా వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి రెల్లి పొదలపై వేయడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చునని బీఎస్ఎన్ఎల్ అధికారులు భావిస్తున్నారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది శ్రీకాకుళం అగ్నిమాపకశాఖ కార్యాలయానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే ఓఎస్‌డీడక్, పీవీసీ వంటి సిగ్నల్ వైర్లు పాక్షికంగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ. 2 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు.

దేశంలో అత్యుత్తమ వైద్యసేవలు



రేడియాలజీ విభాగాన్ని పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి పెద్దపీట వేస్తున్నాయని, ఎన్ఆర్ఐలు సైతం దేశంలోనే వైద్యచికిత్సలు చేయించుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత్రునివలసలో శ్రీ సాయి డెంటల్ రీసెర్చ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డెంటల్ ఫాస్ట్‌ట్రాక్ క్లినిక్, రేడియాలజీ విభాగంలోని సీబీసీటీ మిషన్లను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని అనుమతులతో శ్రీ సాయి డెంటల్ కళాశాల రీసెర్చ్ స్థాయికి చేరుకోవడం శుభపరిణామమన్నారు. అనంతరం కళాశాలకు చెందిన స్పెక్ట్రమ్ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మధు విలేకర్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు, ఐకేరావు తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150–00
బంగారం(22కి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

ఉద్యోగాల సాధనలో నైపుణ్యాలు కీలకం



మాట్లాడుతున్న ఏయూ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ పాల్‌డగ్లస్

ఎచ్చెర్ల క్యాంపస్: పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు తప్పనిసరిగా పెంచుకోవాలని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ పాల్ డగ్లస్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాలులో ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థులకు నిర్వహిస్తున్న మూడు రోజుల ప్రేరణ తరగతుల్లో భాగంగా రెండో రోజు గురువారం పాల్ డగ్లస్ ప్రసంగించారు. రెగ్యులర్ సిలబస్‌తో పాటు ఇంజినీరింగ్‌లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం ఉన్న విద్యార్థులకు తప్పనిసరిగా కొలువు లభిస్తుందన్నారు. వర్సిటీల విద్యార్థులు సైతం ఐఐటీ, ఎన్ఐటీ వంటి సంస్థల్లో చదువుతున్న విద్యార్థులతో సమానంగా వార్షిక ప్యాకేజీలకు ఎంపికవుతున్నారని చెప్పారు. ఏయూ సీఎస్ఈ ప్రొఫెసర్ సత్యానంద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలు విస్తరిస్తున్నందున నైపుణ్యాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రోణంకి శ్రీధర్, విభాగాధిపతి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము చోరీ

నందిగాం: కొత్త అగ్రహారం సచివాలయ పరిధిలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందజేయాల్సిన పింఛన్ సొమ్ము రూ.80 వేలు చోరీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 28న సాయంత్రం సచివాలయ పంచాయతీ కార్యదర్శి మీనాక్షి బ్యాంకు నుంచి నగదు తీసుకొచ్చి గ్రామ వలంటీర్లకు ఇచ్చేందుకు తన టేబుల్‌పై పెట్టారు. ఆ సమయంలో ఆరుగురు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు. బ్యాగ్‌ను అక్కడే మరిచిపోయి బయటకు వెళ్లిన ఆమె తర్వాత వచ్చి చూడగా నగదు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది డబ్బులు వేసుకుని పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తి తెలిపారు.

మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించండి



గ్రాడ్యుయేట్ ఓటర్లకు కరపత్రాలు అందజేసిన స్వతంత్ర అభ్యర్థి దుప్పల రవీంద్రబాబు

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి దుప్పల రవీంద్రబాబు కోరారు. శ్రీకాకుళం నగరంలో గురువారం ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్లను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలపై తనకు పూర్తి అవగాహన ఉందని, ఇక్కడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు.

విద్యా విధానంలో సంస్కరణలు తప్పనిసరి

- విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మైథిలి
- శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సదస్సు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ:

దేశంలో విద్యావిధానంలో మరిన్ని వినూత్నమైన సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మైథిలి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (స్వయంప్రతిపత్తి) కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్),న్యూఢిల్లీ సహకారంతో జాతీయ విద్యా విధానం(నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)–2020 పేరిట రెండురోజులపాటు జరగనున్న జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మైథిలి మాట్లాడుతూ నూతన విద్యా విధానం 2020లో ఒక్కొక్క అంశంపై ఒక్కో సెమినార్ నిర్వహించాలని, అలా చేసినప్పుడే లోటు పాట్లు తెలుసుకొని పరిష్కారదిశగా అడుగులు వేయవచ్చన్నారు. జాతీయ సెమినార్ డైరెక్టర్, కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీకాకుళం మహిళా కళాశాల వరుసుగా మూడు సార్లు నాక్ ఏ–గ్రేడ్ సాధించిందన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్నామని చెప్పారు. ‘ఆజాదీ కా అమృత్ మహోత్సవ్’ సందర్భంగా జరుగుతున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ డి.శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ విధానాలను పాటిస్తూ నూతన పరిశోధనాత్మక ప్రమాణాలను పాటించాలని కోరారు. సెమినార్ కోఆర్డినేటర్ కె.మౌనిక మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ఏ విధంగా ఉపయోగపడుతుంతో వివరించారు. ముందుగా విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మైథిలి, జీఎంఆర్ ఐటీ రాజాం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తమరాన సింహాచలం, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు తదితరులు సావనీర్‌ను ఆవిష్కరించారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సెమినార్ కన్వీనర్ శ్రీరాములు, విశ్రాంత ప్రిన్సిపాల్ మైథిలి, సింహాచలం తదితరులు

చాయిస్ బేస్డ్ విధానం కీలకం..

బరంపూర్ యూనివర్సిటీ(ఒడిశా) రిజిస్ట్రార్, రిటైర్డ్ ప్రొఫెసర్ జగన్నాథ్ పండా ముఖ్య వక్తగా హాజరై ‘కీ యాస్పెక్ట్ అండ్ అమెండమెంట్స్ బ్రాట్ త్రూ ఎన్ఈపీ–2020’ అనే అంశంపై ప్రసంగించారు. విద్యార్థులు చాయిస్ బేస్డ్ విధానాన్ని అవలంబించాలని కోరారు. జీఎంఆర్ ఐటీ రాజాం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తమరాన సింహాచలం ‘టీచింగ్ యూజింగ్ ఐసీటీ టూల్స్’ అనే అంశంపై ప్రసంగించారు. ఎన్ఈపీ బోధనలో మాధ్యమంగా పీపీటీలను వాడటం కీలకమన్నారు. డాక్టర్ కె.మైథిలి ‘మల్టీ డిసిప్లేనరీ అప్రోచ్చేస్ ఇన్ అండ్ గ్రాడ్యుయేషన్ పోస్ట్–ప్రెజెంట్ అండ్ ఫ్యూచర్’ అనే అంశంపై ప్రసంగించారు. అన్ని కళాశాలలు స్వయంప్రతిపత్తిని పొందాలని, 2030 నాటికి 50 శాతానికిపైగా అడ్మిషన్ల పెరుగుదల ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, నీరజ, జ్యోతిలక్ష్మి, రుద్రమరాణి, అధ్యాపకులు, పరిశోధకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.